బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 10 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## పసిడి ధరలు జీవితకాల గరిష్ఠానికి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దేశంలో పసిడి ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చే విధంగా మళ్లీ పెరుగుతున్నాయి. గణనీయంగా పెరగడం కొనసాగుతూ, ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర తులాకు రూ.5,080 పెరిగి జీవితకాల గరిష్ఠం రూ.1,12,750కు చేరింది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, డాలర్ బలహీనపడడంతో బంగారానికి డిమాండ్ పెరిగింది. అదే సమయంలో, వెండి ధరలు కూడా భారీగా పెరిగి కిలోకు రూ.1,28,800కి చేరి రికార్డు స్థాయికి చేరాయి.

ప్రపంచ బంగార మార్కెట్లలో కూడా పసిడి మంగళవారం ఔన్సుకు 3,659.27 డాలర్లుకి చేరి జీవితకాల గరిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత స్వల్పంగా తగ్గి 3,652.72 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. విపణి విశ్లేషకుల ప్రకారం, యూఎస్ డాలర్ బలహీనపడటం మరియు ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను త్వరలో తగ్గించనున్న అంచనాలు పెట్టుబడిదారులను బంగారం వంటి సురక్షిత ఆస్తుల వైపు ఆకర్షిస్తున్నాయి.ఎంసీఎక్స్‌లో అక్టోబర్ ఫ్యూచర్ గోల్డ్ తులాకు రూ.429 లాభంతో రూ.1,08,947 వద్ద ప్రారంభమై, రూపాయి 1,09,500 గరిష్ఠాన్ని తాకింది. కామెక్స్‌లో బంగారం 0.50% లాభంతో 3,654 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# 17వ ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్

- ఎన్డీఏ అభ్యర్థికి 452 ఓట్లు
- ఇండీ కూటమి అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

దేశ 17వ ఉపరాష్ట్రపతిగా ఎన్‌డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో ఆయన 452 ఓట్లు సాధించారు. ఇండియా కూటమి తరఫున పోటీ చేసిన జస్టిస్ బీఎస్ సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు మాత్రమే రావడంతో రాధాకృష్ణన్ 152 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మొత్తం 781 మంది సభ్యులు ఓటు వేయాల్సి ఉండగా, 752 మంది ఓటు వేశారు. అందులో 15 ఓట్లు చెల్లనివిగా తేలాయి. గెలుపు కోసం అవసరమైన 377 ఓట్లకన్నా ఎక్కువగా 452 ఓట్లు సాధించిన రాధాకృష్ణన్ సునాయాసంగా విజయాన్ని అందుకున్నారు.

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవికి ఈ ఎన్నికలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పోలింగ్ ప్రారంభమై, కేంద్రమంత్రులు, కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు వరుసగా ఓటు వేశారు.

పార్లమెంటు ఉభయసభల కలిపి 781 మంది సభ్యులు ఓటు వేయడానికి అర్హులు కాగా, బీఆర్ఎస్, బీజేడీ, శిరోమణి అకాలీదళ్ సభ్యులు దూరంగా ఉన్నారు. ఇప్పటికే ఎన్‌డీఏకు 425 మంది సభ్యుల మద్దతు ఉండగా, వైసీపీకి చెందిన 11 మంది ఎంపీలు కూడా మద్దతు ప్రకటించారు. ఈ గణాంకాల ప్రకారం ఎన్‌డీఏ విజయం ఖాయమని ముందే స్పష్టమైంది.



### సీపీ రాధాకృష్ణన్‌జీవిత నేపథ్యం

సీపీ రాధాకృష్ణన్ తమిళనాడులోని తిరుప్పూర్‌లో 1957 అక్టోబర్ 20న జన్మించారు. 1974లో జనసంఘ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడయ్యారు. గతంలో రెండు సార్లు (1998, 1999) కోయంబత్తూరు ఎంపీగా ఆయన ఎన్నికయ్యారు. ఆ తరువాత 2004, 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చెందారు. ఆయన 2004 నుంచి 2007 వరకు తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా పని చేశారు. 2023 ఫిబ్రవరి 12న జార్ఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. తెలంగాణ గవర్నర్‌గా తమిళిసై సౌందరరాజన్ 2024 మార్చి 18న రాజీనామా చేయడంతో తెలంగాణ గవర్నర్ (అదనపు బాధ్యతలు)గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్‌కు బాధ్యతలు అప్పగిస్తూ 2024 మార్చి 19న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన తెలంగాణ గవర్నర్‌గా 2024 జులై 31 వరకు, పుదుచ్చేరి గవర్నర్‌గా 2024 ఆగస్టు 6 వరకు పని చేశారు. 2024 జులై 27న మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. 2016 నుంచి 2019 వరకు ఆల్ ఇండియా కాయిర్ బోర్డు చైర్మెన్‌గా పని చేశారు.

### గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి
# అనుమతులు మంజూరు చేయాలి


- తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ రాజధానుల మధ్య గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించాల్సి ఉంది
- పలువురు ఎంపీలతో కలిసి ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సమావేశమైన ముఖ్యమంత్రి
- తెలంగాణ విద్యా రంగంలో సమూల మార్పులు తేవడానికి చేస్తున్న కృషికి మద్దతు ఇవ్వండి
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కి సీఎం వినతి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్ వరకు 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి వెంటనే అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం కూడా తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ రాజధానుల మధ్య గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించాల్సి ఉందని గుర్తు చేశారు. తెలంగాణకు సముద్ర రేవు లేనందున, బందరు పోర్ట్ వరకు సరకు రవాణాకు వీలుగా గ్రీన్ ఫీల్డ్ రహదారి మంజూరు చేయాలని కోరారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో 118 కిలోమీటర్లు తెలంగాణలో మిగతా భాగం ఏపీలో ఉంటుందని ముఖ్యమంత్రి గారు వివరించారు.

పలువురు ఎంపీలతో కలిసి ముఖ్యమంత్రి ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని వారి నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల నిర్మాణం, అనుమతులు, పనుల వేగవంతంపై చర్చించారు. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డుకు (నార్త్) 90 శాతం భూ సేకరణ పూర్తయినందున వెంటనే ఫైనాన్షియల్, క్యాబినెట్ అనుమతులు



ఇచ్చి పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి గారు కోరారు. ఆర్ఆర్ఆర్ (నార్త్)కు సమాంతరంగా ఆర్ఆర్ఆర్ (సౌత్) పనులు చేపట్టాలని, అందుకు వెంటనే అన్ని అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్‌ను ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీశైలంతో అనుసంధానించే మన్ననూర్ – శ్రీశైలం రహదారి అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలో ఉన్నందున 4 వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే ఏపీలోని కృష్ణపట్నం రేవుతో పాటు మార్కాపురం, కంభం, కనిగిరి, నెల్లూరులకు రాకపోకలు సులుభమవుతాయని చెప్పారు. రావిర్యాల – ఆమన్‌గల్ – మన్ననూర్ 4 వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మించాలని ముఖ్యమంత్రి గారు కోరారు.

హైదరాబాద్ – మంచిర్యాల మధ్య ఉన్న రాజీవ్ రహదారిపై వాహన రద్దీ అధికంగా ఉన్నందున హైదరాబాద్ –మంచిర్యాల మధ్య నూతన గ్రీన్‌ఫీల్డ్ రహదారిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఆర్ఐఎఫ్ కింద రూ.868 కోట్లతో పంపిన రహదారుల పనులను మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గారిని కోరారు. ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తులకు నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. సీఆర్ఐఎఫ్ పనులకు వారంలోపు అనుమతులు ఇస్తామని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ – అమరావతి – బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి సంబంధించి తమ శాఖ అధికారులను హైదరాబాద్‌కు పంపుతానని హామీ ఇచ్చారు. ఈ అంశంపై ఎన్‌హెచ్, ఎన్‌హెచ్ఏఐ అధికారులతో ఈ నెల 22వ తేదీన హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహిస్తామని ముఖ్యమంత్రి గారు వివరించారు. కేంద్ర మంత్రితో జరిగిన సమావేశంలో ఎంపీలు రేణుకా చౌదరి, డాక్టర్ మల్లు రవి గారు, పోరిక బలరాం నాయక్ గారు, రామసహాయం రఘురాంరెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్యా రంగంలో సమూల మార్పులు తేవడానికి తాము చేస్తున్న కృషికి మద్దతు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గారికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో సుమారు 90 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లోని పిల్లలకు కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రి గారికి వివరించారు.

ముఖ్యమంత్రి ఢిల్లీ నార్త్ బ్లాక్ లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి గారితో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని 105 శాసనసభ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నాలుగు పాఠశాలల నిర్మాణ పనులు మొదలయ్యాయని, మిగతా పాఠశాలలకు సంబంధించి టెండర్లు ముగిశాయన్నారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు ఉంటారని, 2.70 లక్షల మంది విద్యార్థులకు ఈ పాఠశాలల్లో చదువుకునే అవకాశం లభిస్తుందని ముఖ్యమంత్రి గారు వివరించారు. అత్యాధునిక వసతులు, ల్యాబ్‌లు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని వివరించారు. అలాగే రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు కేంద్ర మంత్రి గారికి సీఎం గారు తెలిపారు.

ఈ నిధుల సమీకరణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతించడంతో పాటు ఎఫ్ఆర్‌బీఎం

మిగితా 2వ పేజీలో

# గ్రూప్-1 పై హైకోర్టు సంచలన తీర్పు



- మెయిన్స్ ఫలితాలు రద్దు
- పేపర్లను మళ్లీ మూల్యాంకనం చేయాలని ఆదేశం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రేవంత్ సర్కార్‌కు తెలంగాణ హైకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ ఫలితాలను రద్దు చేస్తూ హైకోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. గతంలో నిర్వహించిన పేపర్లను మళ్లీ మూల్యాంకనం చేయాలని, అదే ఆధారంగా ఫలితాలను విడుదల చేయాలని ఆదేశించింది. అది సాధ్యం కాకపోతే పరీక్ష మళ్లీ నిర్వహించాలని స్పష్టం చేసింది.

గ్రూప్–1 మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని కొందరు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై విచారణ అనంతరం హైకోర్టు తుది తీర్పు ఇస్తూ, టీఎస్‌పీఎస్సీపై గట్టి వ్యాఖ్యలు చేసింది.

హైకోర్టు తీర్పును స్వాగతించిన బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు.. ఇది తెలంగాణ ప్రభుత్వానికి చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. పరీక్షా కేంద్రాల కేటాయింపు నుండి హాల్ టికెట్ల జారీ, ఫలితాల ప్రకటన వరకు అన్నింటిలోనూ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. “లోకభూయిష్ఠంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడింది. హైకోర్టు సరైన సమయంలో సరైన తీర్పు ఇచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఏం సమాధానం చెబుతారు?” అంటూ హరీష్ ప్రశ్నించారు. హడావుడిగా పరీక్షలు నిర్వహించడం, అందులో అవకతవకలకు పాల్పడడం వల్ల విద్యార్థులు, నిరుద్యోగులు నష్టపోయారని విమర్శించారు. “పరీక్షలు నిర్వహించడం, ఉద్యోగాలు ఇవ్వడం అంటే చిల్లర రాజకీయాలు చేయడం కాదు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి కళ్లు తెరవాలి” అంటూ ఎక్స్‌లో హరీష్ ఫైర్ అయ్యారు.

## దేవాదాయశాఖ కమిషనర్‌గా శైలజారామయ్యర్ బాధ్యతలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్‌గా ఆశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ మంగళవారం పూర్తి బాధ్యతలను స్వీకరించారు. ఈనెల 4న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. నిరుడు కమిషనర్‌గా పనిచేసిన వెంకట్రావు గతనెలాఖరులో పదవీ విరమణ చేయడంతో కమిషనర్‌గా ఎవరినీ నియమించలేదు. వెంకట్రావు, హన్మంతరావు తదితరుల పేర్లు వినిపించినప్పటికీ శైలజారామయ్యర్‌కే అదనంగా బాధ్యతలు అప్పగించారు. దీంతో బొగ్గులకుంటలోని ఎండోమెంట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన శైలజారామయ్యర్.. కొన్ని ఫైళ్లను పరిశీలించినట్టు సిబ్బంది తెలిపారు.

# మంటల్లో నేపాల్



- ప్రధాని, అధ్యక్షుడు రాజీనామా
- కొనసాగుతున్న హింసా, ఆందోళనలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ వ్యతిరేక నిరసనలతో హిమాలయ దేశం నేపాల్ రగులుతోంది. సోమవారం కాఠ్మాండులో చెలరేగిన హింసాత్మక ఘటనలలో 22 మంది ప్రాణాలు కోల్పోయి, 250 మందికి పైగా గాయపడ్డారు. నిరసనకారులు పార్లమెంట్, సుప్రీంకోర్టు, అధ్యక్షుడు, ప్రధాని, మంత్రుల నివాసాలపై దాడులు చేసి నిప్పు పెట్టారు. ఈ పరిస్థితిలో, ప్రధాని కేపీ శర్మ ఓలీ మరియు దేశాధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్ రాజీనామా చేశారు. రాజీనామా లేఖలో ఓలీ “దేశ రాజకీయ సంక్షోభానికి పరిష్కారం కనుగొనడానికి వీలుగా రాజీనామా చేస్తున్నాను” అని పేర్కొన్నారు.

నిరసనకారులు మాజీ ప్రధాని ఝలానాథ్ ఖనల్ నివాసానికి నిప్పు పెట్టడంతో, ఆయన భార్య రాజ్యలక్ష్మి చిత్రకార్ మంటల్లో చిక్కి మృతి చెందారు. అలాగే, మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా, ఆయన భార్య, విదేశాంగ మంత్రి అర్జు రాణా దేవ్‌బాపై దాడులు జరిగాయి. మంగళవారం, పోలీసు స్టేషన్లను దాడి చేసిన నిరసనకారులను కట్టుబడించే ప్రయత్నంలో పోలీసుల కాల్పుల్లో రెండు యువకులు మరణించగా, మొత్తం మరణాల సంఖ్య 22కి చేరింది. కాఠ్మాండూ, పోఖ్రాలోని ప్రధాన జైలులపై నిరసనకారులు దాడి చేసి, దాదాపు 900 మంది ఖైదీలు పారిపోయారు. పోఖ్రాలోని స్థానిక జైలులో నిరసనకారులు చొరబడడంతో, మాజీ హెూం మంత్రి రవి లమిచనేనిను మద్దతుదారులు ఇంటికి తీసుకెళ్లారు.

చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అశోక్ రాజ్ సిగ్దెల్ అన్ని పార్టీలు చర్చల్లో పాల్గొని సమస్యను శాంతియుత మార్గంలో పరిష్కరించాలని ఆహ్వానం చేశారు. సైన్యం మరియు భద్రతా సంస్థలు కూడా నిరసనకారులకు సంయమనం పాటించాలన్న విజ్ఞప్తి చేశారు.

భారత ప్రభుత్వం, నేపాల్‌లోని పరిస్థితులను కాగా గమనిస్తున్నట్టు ప్రకటిస్తూ, భారత ప్రజలకు “ప్రస్తుత పరిస్థితుల్లో నేపాల్ సందర్శించవద్దు” అని సూచించింది. అలాగే, అక్కడ నివసిస్తున్న భారతీయులు ప్రభుత్వ సూచనల మేరకు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరాన్ని తెలిపింది. కాఠ్మాండులోని హయత్ రీజెన్సీ హెూటల్‌లో తెలుగు కుటుంబాలు చిక్కుకున్నాయి. హెూటల్ యాజమాన్యం, భద్రతా పరిమితుల కారణంగా వారిని సమీప అతిథిగృహాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

# 2027 నాటికి ఎస్‌ఎల్‌బీసీ పూర్తి చేయాలి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి నల్గొండ జిల్లాలో సాగునీటి సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై జలసౌధలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లాకు చెందిన ఉత్తమ్ ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉండటం సానుకూలమని అధికారులు అభిప్రాయపడ్డారు.

2005లో అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డి ఆమోదంతో మొదలైన ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్ద ఇరిగేషన్ టన్నెల్‌గా నిలుస్తుందని మంత్రి కోమటి రెడ్డి తెలిపారు. ఈ సొరంగం పూర్తయితే కృష్ణా నదీ జలాలను గ్రావిటీ ద్వారా తీసుకోవచ్చని చెప్పారు. అయితే రాజకీయ కారణాలతో ఈ ప్రాజెక్టు పదేళ్ల పాటు నిలిచిపోయిందని గుర్తుచేశారు. 2027 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలని సీఎం, ఇరిగేషన్ మంత్రి ప్రతిజ్ఞ చేశారని తెలిపారు.

ఫ్లోరైడ్ ప్రభావిత నార్కట్ పల్లి మండల ప్రాంతాలకు బ్రాహ్మణ వెల్లెం ప్రాజెక్ట్ ప్రారంభించామని మంత్రి వెల్లడించారు. రిజర్వాయర్ ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని తెలిపారు. వర్షాభావం కారణంగా తాగునీటి సమస్యలు ఎదురవుతున్న కట్టంగూరు, మునుగోడు, నార్కట్ పల్లికి నీరు సరఫరా చేయాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

అప్రోచ్ కెనాల్స్ పూర్తి చేసి దిగువన చెరువులు నింపడం, కొత్త ఆయకట్టు సృష్టించడం వంటి పనులు ప్రారంభమయ్యాయని మంత్రి వివరించారు. బ్రాహ్మణ వెల్లెం ప్రాజెక్ట్ కోసం పైపులైన్ ఏర్పాటుకు వ్యక్తిగతంగా 30 లక్షలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తవ్వాలంటే రూ.3,000 కోట్లు అవసరమని, అందులో 10% నిధులు బ్రాహ్మణ వెల్లెం ప్రాజెక్ట్‌కి కేటాయించాలని సూచించారు.

## ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో కీలక పరిణామం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ–కార్ రేసింగ్ కేసులో నిందితులను ప్రాసిక్యూట్ చేయటానికి అనుమతినివ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఏసీబీ అధికారులు లేఖ రాశారు. ఈ–కార్ రేసింగ్‌కు సంబంధించి దర్యాప్తు పరంగా అనేక వివరాలను, ఆధారాలను నిందితుల నుంచి సేకరించటం జరిగిందని ఈ సందర్భంగా లేఖలో ఏసీబీ అధికారులు పేర్కొన్నట్టు తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ–కార్ రేసింగ్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా దీని నిర్వహణ కోసం ఇంగ్లాండ్‌కు చెందిన కంపెనీకి రూ.54 కోట్లను చెల్లించారనీ, అయితే ఇందుకు ప్రభుత్వపరమైన నిబంధనలు, మార్గదర్శకాలను ఏ మాత్రమూ పట్టించుకోలేదని కూడా వివరించినట్టు సమాచారం. ముఖ్యంగా హెచ్ఎండీఏ నుంచి కార్ రేసింగ్‌ను నిర్వహించటానికి గానూ రూ.54 కోట్ల మేర చెల్లింపులు జరిపారనీ, ఈ విషయంలో ఆర్బీఐ నుంచి ఎలాంటి అనుమతులూ పొందలేదనీ, అందుకు గానూ రూ.7 కోట్లను జరిమానాగా ఆర్బీఐ రాష్ట్ర ప్రభుత్వానికి విధించిందని కూడా పేర్కొన్నారని తెలిసింది. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఏసీబీని ఆదేశించింది. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు దర్యాప్తును చేపట్టి ఈ–కార్ రేసింగ్‌తో సంబంధమున్న అప్పటి రాష్ట్ర మునిసిపల్ వ్యవహారాల శాఖ మంత్రి, ప్రస్తుత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ప్రధాన నిందితుడిగా, అప్పటి హెచ్ఎండీఏ డైరెక్టర్, ప్రస్తుత సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను రెండో నిందితుడిగా, హెచ్ఎండీఏ సీఎఫ్ఓ బి.రెడ్డిని మూడో నిందితుడిగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్‌ను కూడా నమోదు చేసింది. పైన పేర్కొన్నవారితో పాటు ఈ–కార్ రేసింగ్‌ను నిర్వహించిన ఇంగ్లాండ్ కంపెనీ నెక్స్ట్ జెన్ సీఈఓ కిరణ్‌లను కూడా విచారించింది. మొత్తమ్మీద తాము ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నిందితులను ప్రాసిక్యూట్ చేయటానికి అనుమతులివ్వాలని తాజాగా ప్రభుత్వానికి ఏసీబీ అధికారులు లేఖ రాసినట్టు తెలిసింది. దీనిపై ప్రభుత్వం ఇచ్చే అనుమతి కోసం ఏసీబీ అధికారులు ఎదురు చూస్తున్నట్టు సమాచారం.

# గ్రూప్-1 పరీక్షలు మళ్లీ నిర్వహించాలి



- జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు మళ్లీ నిర్వహించాల్సిందేనని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. నంది నగర్‌లోని తన నివాసంలో నిరుద్యోగ అభ్యర్థులతో సమావేశమైన తర్వాత, మీడియాకు ఆయన వివరించారు, “పరీక్షల రీవాల్యుయేషన్ అయినప్పటికీ నిరుద్యోగ అభ్యర్థుల నమ్మకం పొందడంలో విఫలమవుతుంది. వారికి భరోసా కల్పించాలంటే, మరోసారి పరీక్షలు నిర్వహించాలి” అని కేటీఆర్ అన్నారు.

గ్రూప్–1 రిక్రూట్‌మెంట్‌లో ఎక్కడ తప్పు జరిగిందో, రీవాల్యుయేషన్లో పెద్ద మిస్టేక్స్ ఎలా జరిగాయో, ఈ పోస్టులను ఎవరు అమ్మారో తెలుసుకోవాలంటే జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. “హైకోర్టు సిట్టింగ్ జడ్జి, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా రిటైర్డ్ జడ్జితో కమిషన్ పెట్టాలి. భవిష్యత్‌లో ఇలాంటి తప్పిదాలు జరగకుండా నిజాలు బయటకు రావాలి” అని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత కాంగ్రెస్ గ్యారంటీని నమ్మి ఓటు ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం “2 లక్షల ఉద్యోగాలు ఇస్తాం” అని వాగ్దానం చేసి, ఆ తర్వాత జాబ్ క్యాలెండర్ మోసం చేసినందున యువతకు న్యాయం జరగలేదని ఆరోపించారు.

గ్రూప్ –1 రిక్రూట్‌మెంట్‌లో భాగంగా 500 ఉద్యోగాలకు కేసీఆర్ నోటిఫికేషన్ ఇస్తే కాంగ్రెస్ దాన్ని రద్దు చేసి అదనంగా 63 పోస్టులు జోడించి.. అంటే 563 ఉద్యోగాలకు ఫ్రెష్ రిక్రూట్‌మెంట్ అని చెప్పి ఎగ్జామ్ పెట్టారు. కేసీఆర్ హయాంలో టీఎస్‌పీఎస్సీ పరీక్ష లీకైందని నిఘా వ్యవస్థ ద్వారా సమాచారం రాగానే.. సీఎంగా కేసీఆర్ నిర్ణయం తీసుకుని.. సరిదిద్దాలనే ఉద్దేశంతో ఆ పరీక్షను రద్దు చేశారు. కానీ ఈ ప్రభుత్వం 563 ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించగా అవకతవకలు జరిగాయి. కేసీఆర్ ఇచ్చిన జీవో వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు న్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 ద్వారా అన్యాయం జరుగుతుంది.. దయచేసి సవరించండి అంటే సవరించ లేదు.. పెడచెవిన పెట్టారు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.


ఇక ఎగ్జామ్స్ ఫలితాలు వెలువడిన తర్వాత తెలుగు మీడియం విద్యార్థులకు అన్యాయం జరిగిందని అక్రోషించినా పట్టించుకోలేదు. కొన్ని సెంటర్లలో ఉన్నవారికి ఎక్కువ మార్కులు వచ్చాయని, వరుసగా రూల్ నంబర్లు ఉన్నావారికి ఎక్కువ మార్కులు వచ్చాయని కుంభకోణం జరిగిందని నిరుద్యోగ అభ్యర్థులు ఆధారాలతో ఆరోపించారు. ఉద్యోగాలను అమ్ముకున్నారని సవరించండి అని ప్రభుత్వం వద్దకు వెళ్లినా న్యాయం జరగేలదు. చివరకు విధిలేక కోర్టును ఆశ్రయిస్తే ఇవాళ శుభవార్త చెప్పింది. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల్లో లోటు పాట్లు జరిగాయని.. రీవాల్యుయేషన్ చేయాలని, లేదంటే మళ్లీ పరీక్షలకు వెళ్లాలని హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ రాష్ట్ర ప్రభుత్వం కూడా భేషజాలకు వెళ్ళి, విద్యార్థుల జీవితాలను ఆగం చేయకండి. విద్యార్థుల కష్టంతో మీరు గద్దెనెక్కి

మిగితా 2వ పేజీలో

## నిర్ణీత సమయంలోగా గవర్నర్లు నిర్ణయం తీసుకోవాలి

- సుప్రీంకోర్టు
- ఆర్టికల్ 200పై రాజ్యాంగ ధర్మాసనంలో విచారణ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు నిర్ణీత సమయంలోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మంగళవారం వెలువడిన తీర్పులో, ఆర్టికల్ 200లో ‘సాధ్యమైనంత త్వరగా’ అనే పదం లేకపోయినా, గవర్నర్లు ఆలస్యం చేయకూడదని ధర్మాసనం పేర్కొంది.

అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపడం, తిరస్కరించడం, పునః పరిశీలనకు పంపడం లేదా రాష్ట్రపతికి నివేదించడం వంటి అధికారాలు ఉన్నాయని కోర్టు గుర్తు చేసింది. ఈ వ్యవహారంపై ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముందు ఎనిమిదో రోజు విచారణ కొనసాగింది. గవర్నర్లు బిల్లులను నిరవధికంగా పెండింగ్‌లో ఉంచకూడదని, నిర్ణీత కాల వ్యవధిలో తేల్చాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ కేసుకు సంబంధించిన వాదనలను సెప్టెంబర్ 10న ముగించాలని ధర్మాసనం నిర్ణయించింది.

# క్యాన్సర్ డే కేర్ సెంటర్లు ప్రారంభం

- సంవత్సరానికి 55 వేల కేసులు నమోదు
- నర్సింగ్ విద్యార్థులు ఇంగ్లీష్‌పై పట్టు సాధించేలా కృషి
- జర్మనీ, జపాన్ కొలబ్రేషన్‌తో ఎంఓయూ : వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ




బలగం టీవీ, హైదరాబాద్

క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి అని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్రంలోని 34 జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్యాన్సర్ డే కేర్ సెంటర్లను మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ నుంచి వర్చువల్‌గా మంత్రి దామోదర్ ప్రారం భించారు. అలాగే, రాష్ట్రంలోని నర్సింగ్ కాలేజీల్లో చదివే విద్యార్థులు జర్మనీ, జపాన్‌లాంటి విదేశాల్లో ఉద్యోగాలు పొం దేందుకు వీలుగా ఇంగ్లీష్‌పై పట్టు సాధించేలా ఇఫ్లూ(ఇంగ్లీష్ ఫారిన్) యూని వర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ప్రాణాంతక మైన క్యాన్సర్ వ్యాధిని నివారించడం కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, పేదవారికి మెరుగైన వైద్య సేవలు అందిం చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. క్యాన్సర్‌పై గ్రామీణ ప్రాంతాల వారికి అవగాహన లేక సమయానికి చికిత్స తీసుకోవడం లేదని, దాంతో చికిత్స తీసుకునేందుకు వచ్చే సమయానికి రెండో దశ, మూడో దశ దాటిపోతుంద న్నారు. క్యాన్సర్ వ్యాధిని నివారించడం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఒక్కొక్క కేర్ సెంటర్‌లో 20 బెడ్లు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఏడాది రాష్ట్రంలో 55 వేల మంది క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని, వచ్చే సంవత్సరంలో అది 75 వేల వరకు వెళ్లే అవకాశం ఉంద న్నారు. క్యాన్సర్‌కు చికిత్స పొందాలంటే రాష్ట్రంలో జేఎన్‌జీ, నిమ్స్‌లో మాత్రమే అవకాశం ఉందన్నారు. క్యాన్సర్‌పై పోరాడిన నూరి దత్తాత్రేయను సలహా దారులుగా ప్రభుత్వం నియమించిందని తెలిపారు. అదేవిధంగా ప్రతి జిల్లాకు ఒక మొబైల్ స్క్రీనింగ్ వాహనాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ వాహనాలు ప్రతి గ్రామానికి వెళ్లి క్యాన్సర్ పరీక్షలు చేసి నిర్ధారణ చేస్తాయని వివరించారు.

# సమ్మక్క సారలమ్మ మహా జాతర ఏర్పాట్లపై సీఎం ప్రత్యేక దృష్టి



మంత్రి ధనసరి సీతక్క

బలగం టీవీ, హైదరాబాద్

వచ్చే సంవత్సరం జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరను పురస్కరించుకొని సందర్శకులకు సకల సౌకర్యాల కల్పనకు ఏర్పాట్లు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మేడారంలో జరుగునున్న పనులను పరిశీలించడానికి వారంలోగా ముఖ్యమంత్రి మేడారాన్ని పర్యటిస్తారని తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా తాడ్వాయి(ఎస్ఎస్) మండలం మేడారం గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న వీఐపీ పార్కింగ్ రోడ్డు, పోలీస్ కంట్రోల్ రూమ్, హరిత హోటల్ తదితర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ శబరిష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ బానోతు రవిచంద్రతో కలసి మంత్రి పరిశీలించారు. అనంతరం మేడారంలోని ఐటీడీఏ సమావేశం హాల్లో అమ్మవార్ల పూజారులు, అన్ని శాఖల అధికారులతో శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర-2026పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.150 కోట్లు కేటాయించిందని, ఆయా శాఖల అధికారులు 100 రోజుల నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గద్దెల ప్రాంతంలో పూజారుల మనోభావాలు దెబ్బ తినకుండా వారి సూచనల మేరకు నూతన హంగులతో శాశ్వతంగా నిలిచిపోయేలా పనులు చేయాలని తెలిపారు. మేడారం గ్రామస్తులు, పూజార్ల అభిప్రాయాలను సైతం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర పండుగగానే కాకుండా మరో కుంభమేళా తరహాలో జరగనున్న జాతరకు సామాన్య పౌరుని నుంచి రాష్ట్రపతి, ప్రధానమంత్రి లాంటి ముఖ్యులు హాజరయ్యే అవకాశం ఉన్నదని అన్నారు. వీఐపీలకు ఇబ్బందులు రాకుండా విమానాలు సైతం దిగే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈసారి చేపట్టనున్న పనులు శాశ్వతంగా ఉండే విధంగా నాణ్యతగా జరిగేలా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వనదేవతల ప్రాంతంలో రాజకీయాలు చేసే ఏ రాజకీయ నాయకుడు ఎదగలేదని, రానున్న మహా జాతరను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ స్థపతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఈ శివనాగిరెడ్డి, అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, ఈఓ వీరస్వామి, ఆర్కిటెక్చర్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మనిషి సంస్కరించేలా విద్య ఉండాలి : మంత్రి జూపల్లి

బలగం టీవీ, హైదరాబాద్

మార్కులు, ర్యాంకులు, సీట్లు, ఉద్యోగాలు అనే చట్రం నుంచి బయటపడాలనీ, మనిషి సంస్కరించేలా విద్య ఉండాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకాంక్షించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ భాషా, సాంస్కృతిక ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవం, ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజి నారాయణరావు 111వ జయంతి ఉత్సవాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా కాళోజి అవార్డును ప్రముఖ కవి నెల్లుట్ల రమాదేవి కి మంత్రి జూపల్లి కృష్ణారావు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రంథాలయ, భాషోద్యమంలో కాళోజి కీలకపాత్ర పోషించారని కొనియాడారు. సమాజంలోని సమస్యల పరిష్కారం కోసం తన అక్షర ఆయుధాలను సంధించిన వైతాళికుడు అని చెప్పారు. రాజకీయ వ్యంగ్య కవిత్వం రాయడంలో ఆయనది అందెవేసిన చేయి అన్నారు. సమాజం గొడవే నా గొడవ అంటూ నిజాం పాలకులను కాళోజి ప్రశ్నించి రెండు సార్లు జైలుజీవితాన్ని గడిపారని గుర్తుచేశారు. డిజిటల్, సోషల్ మీడియా, సినిమాలోకంలోకి ప్రజలు కూరుకుపోవడం, వాటి ద్వారా జీవన విధానం విధ్వంసమై పిల్లల్లో రోజురోజుకీ నేరప్రవృత్తి పెరిగిపోతుండటం పట్ల మంత్రి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ ఉన్న ఒక్క జీవితాన్ని సార్థకం చేసుకోవాలని సూచించారు. సమాజ పరివర్తన కోసం కవులు, రచయితలు విరివిగా సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని హామీనిచ్చారు. కవులు, రచయితలు తమ సాహిత్యాన్ని నాలుగుగోడలకే పరిమితం కాకుండా సోషల్‌మీడియా ప్లాట్‌ఫారం పైనా విస్తృతంగా అందుబాటులో ఉంచాలనీ, చర్చకు పెట్టాలని విన్నవిం చారు. గ్రంథాలయాలకు కాళోజి సాహిత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉచితంగా అందజేస్తామని హామీనిచ్చారు. గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రియాజ్ మాట్లాడుతూ..సృజనాత్మకతకు కేరాఫ్ అడ్రస్ సాహిత్యమని నొక్కి చెప్పారు. అయితే, పుస్తకాలు రాస్తూ పోవడమే కాదు..వాటిని ప్రజలతో చదివించడం, చర్చలో పెట్టడం వంటివి చేయించే బాధ్యత కవులపై ఉందన్నారు. తొలిసారి మహిళా రచయిత నెల్లుట్ల రమాదేవికి కాళోజి పురస్కారం దక్కటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కవి, రచయిత, కార్టూనిస్టు, అవార్డు గ్రహీత నెల్లుట్ల రమాదేవి మాట్లా డుతూ.. సాహిత్యం గాలి సోకకనే పిల్లలు ఆగమైపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాలలోనూ లైబ్రరీ ఉండేలా, లైబ్రరీ పీరియడ్ పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. పాఠశాలల్లో ప్రతివారం పిల్లలకు ఒక పుస్తకం ఇచ్చి చదివించాలనీ, ఆ పుస్తకంపై చర్చపెట్టాలనీ, పిల్లలకు కలిగిన అనుభూతిపై రాయించాలని సూచించారు. అప్పుడే పుస్తక పఠనం పెరుగుతుందనీ, పిల్లల ప్రవర్తన మంచి మార్గం వైపు మరలుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాళోజిని మార్గదర్శిగా, ఆదర్శంగా తీసుకుని గ్రంథా లయాలను మరింత విస్తరించాలని ప్రభుత్వానికి విన్నవించారు. కార్య క్రమంలో దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ భాషా, సాంస్కృతిక కార్యదర్శి ఎన్.బాలాచారి, కాళోజి ఫౌండేషన్ చైర్మెన్ వీఆర్.విద్యార్థి, ఫౌండేషన్ సభ్యులు పొట్లపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



## రూ.1500 కోట్ల తక్షణ సాయం

- హిమాచల్ ప్రదేశ్‌లో మోడీ ఏరియల్ సర్వే అనంతరం ప్రకటన

బలగం టీవీ, హైదరాబాద్

భారీ వరదలు, కొండచరియలు విరిగి పడి అతలాకుతలమైన హిమాచల్ ప్రదేశ్‌లో పరిస్థితిని ప్రధాని మోడీ మంగళవారం ఏరియల్ సర్వే ద్వారా సమీక్షించారు. ముఖ్యంగా మండి, కులు జిల్లాల్లో పరిస్థితిని సమీక్షించారు. మంగళవారం ముందుగా గగ్గల్ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధానికి గవర్నర్ శివ ప్రతాబ్ శుక్లా, ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, ఉప ముఖ్యమంత్రి ముకేశ్ అగ్నిహోత్రి, ఇతర బీజేపీ ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. తరువాత ఇక్కడ నుంచి మోడీ ఏరియల్ సర్వే కొరకు బయలుదేరి వెళ్లారు. దీని తరువాత ముఖ్యమంత్రి, ఇతర అధికారులు, బీజేపీ నాయకులతో జరిగి సమీక్షా సమావేశంలోనూ మోడీ పాల్గొన్నారు. జూన్ 20 నుంచి ఈ నెల 8 వరకూ సంభవించిన భారీ వర్షాల కారణంగా హిమాచల్‌ప్రదేశ్‌కు రూ.4,122 కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు మోడీకి వివరించారు. 370 మంది మరణించారని చెప్పారు. మరో 41 మంది ఆచూకీ లేకుండా పోయారని వివరించారు. 6,344 ఇండ్లు, 461 దుకాణాలు, కర్మాగారాలు పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతిన్నాయని వెల్లడించారు. 1748 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 461 మంచి నీటి సరఫరా పథకాలకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. ప్రధాని మోడీ హిమాచల్‌ప్రదేశ్‌కు రూ. 1,500 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రెండో విడతను ముందస్తుగా విడుదల చేస్తామని తెలిపారు. అలాగే, హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే బృందాలను పంపిందని, ఈ బృందం సమర్పించే వివరణాత్మక ఆధారంగా తదుపరి సహాయాన్ని అందచేయడంపై పరిశీలిస్తామని మోడీ తెలిపారు.

## గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పరిమితి నుంచి మినహాయించాలని నిర్మలా సీతారామన్ గారిని ముఖ్యమంత్రి గారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై చేస్తున్న వ్యయాన్ని పెట్టుబడిగా పరిగణించాలని కోరారు. గత ప్రభుత్వంలో అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చిందని, వాటి చెల్లింపు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారిన నేపథ్యంలో వాటి రీస్ట్రక్చరింగ్‌కు అనుమతించాలని కోరారు. ముఖ్యమంత్రి గారు చేసిన విజ్ఞప్తులపై నిర్మలా సీతారామన్ గారు సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి తో పాటు కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి గారు, పోరిక బలరాం నాయక్ గారు, సురేశ్ షెట్కార్ గారు, చామల కిరణ్ కుమార్ రెడ్డి గారితో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉన్నారు.

## గ్రూప్-1 పరీక్షలు మళ్లీ నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

కూర్చున్నారు కాబట్టి వారికి రాజకీయ రంగు పూలమకుండా న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.

## ఏసీబీకి చిక్కిన నార్సింగి టీపీవో

- రూ.4 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

బలగం టీవీ, హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా నార్సింగి మున్సిపాలిటీలో ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో టౌన్ ప్లానింగ్ అధికారి మణిహారిక రూ.4 లక్షలు లంచం తీసుకుంటూ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు. ఓ ఇంటికి ఎల్ఆర్ఎస్ క్లియరెన్స్ కోసం అధికారి లంచం డిమాండ్ చేయగా.. ఇంటి యాజమాని ఏసీబీని ఆశ్రయించాడు. బాధితుని నుంచి లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు పట్టు కున్నారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిరేవుల గ్రామానికి చెందిన వినోద్ అనే వ్యక్తి వెయ్యి గజాల ప్లాట్ ఎల్ఆర్ఎస్ క్లియరెన్స్ కోసం నార్సింగి మున్సిపల్ అధికారులను సంప్రదించాడు. అప్పటికే ప్రభుత్వానికి రూ.6లక్షలు చెల్లించాడు. క్లియరెన్స్ కోసం ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగాడు. ఈ క్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి మణిహారిక బాధితుడిని రూ.10లక్షలు డిమాండ్ చేసింది. అతను అంత ఇవ్వలేనని చెప్పడంతో రూ.5లక్షలు ఇవ్వాలని కోరింది. అయితే రూ.4లక్షలు ఇస్తానని చెప్పాడు. అనంతరం బాధితుడు ఏసీబీ అధికారుల ను ఆశ్రయించాడు. మంగళవారం ఉదయం మున్సిపల్ కార్యాల యంలో మణిహారికకు రూ.4లక్షలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మున్సిపల్ కార్యాల యంలో విచారణ చేపట్టారు. విలువైన డాక్యుమెంట్లు, ఇతర పత్రాలను పరిశీలించారు. అలాగే టౌన్ ప్లానింగ్ అధికారి నివాసంలో కూడా సోదాలు నిర్వహించారు. ఈ అవినీతిలో ఎవరెవరు ఉన్నారనే కోణంలో పూర్తిస్థాయి లో దర్యాప్తు చేస్తున్నారు. మణిహారికను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏవరైనా లంచం డిమాండ్ చేస్తే తమకు దృష్టికి తీసుకు రావాలని ఏసీబీ డీఎస్పీ సూచించారు. నార్సింగి మున్సిపాలిటీలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయిందని, కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల అండదండలతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తు న్నారని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు.



## ఇల్లంతకుంటలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తో పాటు పలు పాఠశాలల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ జి. నగేశ్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పాఠశాలల పనితీరుతో పాటు మధ్యాహ్న భోజన నిర్వహకులతో సంభాషించి అనుసరిస్తున్న విధి విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయుల సహకారంతో ఏర్పాటు చేసుకున్న మౌలిక వసతులు కల్పనతో పాటుగా పాఠశాలలోని పదో తరగతి విద్యార్థిని విద్యార్థులతో ముఖాముఖి సంభాషిస్తూ భావి భారత నిర్మాణంలో విద్యార్థులే కీలకమని వారి ఉజ్వల భవిష్యత్తుకు రెట్టింపు ఉత్సాహం తో కృషి చేయాలని సూచించారు. రాబోయే కాలంలో పబ్లిక్ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయడానికి మరింత కష్టపడుతూ ఉపాధ్యాయులను సంపూర్ణంగా వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎమ్. ప్రేమల, సీనియర్ ఉపాధ్యాయులు వి. మహేష్ చంద్ర, రమణారెడ్డి, మధుసూదన్ రావు, లత, సునీత, సరిత, ఫయాజ్ మహమ్మద్ , సుజాత దేవి పాల్గొన్నారు.



## అంజన్న దర్శనానికి దారేది...

**-మానేరు వరదకు కొట్టుకపోయిన బ్రిడ్జి.**

**బలగం టీవీ,గంభీరావుపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం భీముని మల్లారె డిపేటలోని శ్రీవీరాంజనేయస్వామి కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా పూజలందుకుంటున్నాడు. ఈ ప్రాంతమంతా ప్రకృతి రమణీయతకు, ఆధ్యాత్మిక శోభకు పెట్టింది పేరు. వీరాంజనేయ స్వామి తో శ్రీ సీతా రామచంద్ర స్వామి,శ్రీ వెంకటేశ్వర స్వామి, రాజరాజేశ్వర స్వామిని ఉమ్మడి మెదక్, ఉమ్మడి నిజాంబాద్ మరియు ఉమ్మడి కరీంనగర్ నుండి భక్తులు దర్శించుకోవడానికి వస్తారు.శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం గుట్ట చుట్టూ మాండవ్య నది(మానేరు వాగు) ప్రవహిస్తుంది. స్వామి వారిని దర్శించుకోవడానికి వెళ్లాల్సిందంటే మాండవ్య నది దాటాల్సిందే. గతంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా దాతల సహకారంతో గ్రామస్తులు మా నీరు వాగుపై చిన్న బ్రిడ్జిని నిర్మించారు. గత 15 రోజుల క్రితం భారీగా కురిసిన వర్షాలకు ఎగువ మానేరు మత్తడి ఉప్పొంగి దూకడంతో భారీగా వరద రావడంతో శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్నా బ్రిడ్జి కొట్టుకపోయింది. స్వామివారిని దర్శించుకోవడానికి వీలు లేక పలువురు భక్తులు వెనుతిరిగి వెళ్ళిపోతున్నారు. బ్రిడ్జి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్వామివారిని దర్శించుకోవాలంటే సాహసంతో మానేరు వాగు దాటాల్సి వస్తుందని, ప్రభుత్వం అధికారులు స్పందించి బ్రిడ్జిని మంజూరు చేయాలని పలువురు భక్తుల కోరుతున్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

**బలగం టీవీ, ఇల్లంతకుంట**


తెలంగాణ తొలిపొద్దు గా పేరుపొందిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఇల్లంతకుంట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపాల్ దేవరాజం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "కాళోజీ నారాయణ రావు ఉద్యమమే ఊపిరిగా జీవించిన మహనీయుడనీ,'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి %-% అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు' అని సగర్వంగా ప్రకటించిన కవి అని కొనియాడారు.ఆయన ఆలోచనలు నేటికీ సమాజానికి మార్గదర్శకం" అని విద్యార్థులకు సందేశాన్నిచ్చారు.ఈ కార్యక్రమంలో లెక్చరర్లు నయీమొద్దీన్, శ్రీనివాస్, లక్ష్మణ్, మమత, రాజశేఖర్, రమేష్ పాల్గొన్నారు

# పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి

**-రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం..**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..**

**బలగం టీవీ, వేములవాడ**



ప్రభుత్వం రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, వారికోసం అనేక సంక్షేమ పథకాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్నదని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు.మంగళవారం వేములవాడ పట్టణంలో 9,10,11,12 వార్డుల్లో పలు కుల సంఘ భవనాల నిర్మాణనికి మంజూరైన ప్రొసీడింగ్ పత్రాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. సందర్భంగా ప్రభుత్వ అది శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విదంగా వేములవాడ పట్టణంలో పలు కుల భవనాలు నిర్మాణం కోసం పెద్ద ఎత్తున నిధులు అందజేస్తున్నామని,ఇప్పటి వరకు 43 కుల సంఘాలకు 2 కోటి 50 లక్షల నిధులు మాంజరు చేసి మంజూరు పత్రలను వారికి అందజేసామని అన్నారు.

పట్టణంలో ఇల్లు లేని వారికి మొదటిసారి 400 పైగా ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, వాటిలో సుమారు 300 ఇల్లు బేస్మెంట్ లెవల్ దాటి నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు. అడుగు స్థలం లేని వారికి కూడా ఇండ్లు మంజూరు చేస్తామని,గత ప్రభుత్వం అభివృద్ధిని కేవలం రంగురంగుల బ్రోచర్లలో వీడియోలలో చూపెట్టారని,కానీ ప్రజా ప్రభుత్వం అభివృద్ధిని క్షేత్రస్థాయిలో చేసి చూపెడుతుందని అన్నారు. ఇప్పటికె వేములవాడ దేవాలయ అభివృద్ధి, రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం అయ్యాయని, గతంలో బీ ఆర్ ఎస్ నాయకులు మూడవ బ్రిడ్జి లేకున్నా ఉన్నట్లు చూపెట్టారని అన్నారు.

ములవాగులో,గుడి చెరువులో మురికి నీరు కలవకుండ చర్యలు తీసుకుంటు న్నామని,గత ప్రభుత్వం ఇవ్వన్నీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.కొందరు వచ్చి ఎదో ఎదో మాట్లాడుతున్నారని,వాళ్లెం మాట్లాడుతు న్నారో, ఏం జరుగుతుందో కనీసం తెలుసుకో కుండా మాట్లాడుతున్నారని అన్నారు.

వేములవాడ పట్టణంలో జరిగే అభివృద్ధి వారికీ కనిపిస్తలేదా, అందరికీ అభివృద్ధి కండ్ల కి కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న ఒకరిద్దరికి మాత్రం కనిపించడం లేదని అన్నారు. మర్రిపల్లి రిజర్వాయర్,కలికోట సూరమ్మ రిజర్వాయర్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, తట్టెడు మట్టి తీశారా అన్నవారు వెళ్లి చూడాలని అన్నారు. గ్రామాల్లో పట్టణాల్లో ప్రజల కనీస మౌలిక వసతుల కోసం నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నామని,

52 ఏళ్లుగా ఎదురుచూసిన రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమయ్యాయని అన్నారు.

పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని, పట్టణంలో జరిగే అభివృద్ధి చూసి మా పరిస్థితి ఏంటని కొందరు ఆందోళన చెందుతున్నారని అన్నారు.వేములవాడ దేవస్థానికి 33/ 11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు కావడం జరిగిందని,వేములవాడ నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు 11 33/ 11 కేవీ సబ్ స్టేషన్ లు, ఒక 132/32 కేవీ,220కెవి సబ్ స్టేషన్ మంజూరు చేసామని అన్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మీ ఆశీర్వాదం అందించాలని అన్నారు.

# దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలు ఆర్థికంగా ఎదిగేలా తోడ్పాటు



**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పాడి గేదెల పంపిణీ కార్యక్రమం ద్వారా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలు ఆర్థికంగా ఎదిగేలా తోడ్పాటు అందిస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.మంగళవారం బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలో ఏర్పాటు చేసిన మినీ డైరీ (పైలెట్ ప్రాజెక్టు) క్రింద పాడి గేదెల పంపిణీ కార్యక్రమం లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పాల్గొన్నారు.కాళోజీ జయంతి సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులంలో సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ ద్వారా 19 మంది లబ్ధిదారులకు 38 గేదెలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. గేదెల పంపిణీ కార్యక్రమం ద్వారా దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న కుటుంబాలు పేదరికం నుంచి బయటపడే ఆస్కారం ఉంటుందని అన్నారు. ప్రతి లబ్ధిదారులకు రెండు గేదెలను పంపిణీ చేస్తున్న నేపథ్యంలో రోజుకు 2000 వరకు సంపాదించు కోవచ్చని,గేదెల కోసం అవసరం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు .

చోప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమాజంలో అత్యంత వెనుకబడిన దళితులను ఆదుకోవడానికి మంచి విద్య అందించడంతో పాటు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు అందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. గతం కంటే రెట్టింపుగా విదేశీ విద్యకు రేవంత్ సర్కార్ నిధులు విడుదల చేస్తుందని, గత సంవత్సరం 500 మంది వరకు దళిత వర్గాల బిడ్డలకు విదేశాలలో చదువుకునేందుకు 20 లక్షలు ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం ద్వారా దళిత వర్గాల విద్యార్థులకు మెరుగైన వస్తువులు కల్పనకు చర్యలు చేపట్టామని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో క్యాబినెట్ లో నలుగురు దళిత వర్గాలకు చెందిన నాయకులకు భాగస్వామ్యం కల్పించడం జరిగిందని అన్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ క్రింద మన సిరిసిల్ల జిల్లాలో అత్యధికంగా యూనిట్లు గ్రౌండ్ చేయడం జరిగిందని అన్నారు.బోయిన్పల్లి మండలంలో దరఖాస్తు పెట్టుకున్న ప్రతి ఒక్కరికి పాడి గేదెలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయంతో పాటు పాడి పంటలు పెరిగితే పేద కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగవుతాయని అన్నారు.ముందుగా 40 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం కుదురుపాక లోని పశు వైద్యశాల ఉపకేంద్రాన్ని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయుటకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఈడి ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, సంబంధిత అధికారులు,స్థానిక నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

**ఆన్లైన్ కోచింగ్ తరగతులను సద్వినియోగ పరుచుకోవాలి**

బోయిన్ పల్లి మండల కేంద్రం లోని తెలంగాణ మోడల్ స్కూల్ లో ఆన్ అకాడమీ ద్వారా ఆన్ లైన్ తరగతులను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పిల్లలకు పోటీ పరీక్షల రాసేందుకు ఆన్ లైన్ తరగతుల ద్వారా మంచి శిక్షణ ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుం టున్నామని అన్నారు. ఆన్ లైన్ తరగతుల్లో దేశంలోని నిపుణులైన టీచర్లచే పిల్లలకు బోధన జరుగుతుందని, ఢిల్లీ లో విద్యార్థులకు అందే శిక్షణ నేడు సాంకేతికతను వినియోగించుకుని మన సిరిసిల్ల జిల్లాలోని పిల్లలకు కూడా అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకుని వస్తే సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ పేదల విద్యకై నిరంతరం కృషి చేస్తూ పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు.సిరిసిల్ల జిల్లాలో పిల్లలకు ఆన్ లైన్ తరగతుల ద్వారా ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చోరువ చూపారని అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే లు కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తాసిల్దార్ ఎంపీడీవో కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు, స్థానిక నాయకులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్రావుపల్లిలో బీఎన్ఎస్ సెక్షన్ 163 (144 సెక్షన్)

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**



ముస్తాబాద్ మండలం వెంకట్రావు పల్లి గ్రామంలో బి. ఎన్. ఎస్. సెక్షన్ 163 (144 సెక్షన్) అమలు చేస్తున్నట్లు చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్తాబాద్ మండలం వెంకట్ రావు పల్లి గ్రామంలో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు పోలీస్ అధికారుల సూచనల ప్రకారం బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 వెంటనే అమలు చేస్తున్నట్లు ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

# మొదటి మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ గెలుపు



**బలగం టీవీ, హైదరాబాద్**

ఆసియా కప్ తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ ఘన విజయాన్ని నమోదు చేసింది. పసికూన హాంకాంగ్ చైనాను 94 పరుగుల తేడాతో చిత్తు చేసి, గ్రూప్‌బీలో అగ్రస్థానంలో నిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. ఓపెనర్ సెడీఖుల్లా అటల్ (73 నాటౌట్), ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (53) అర్ధ శతకాలతో రాణించారు. ప్రత్యేకించి డెత్‌ఓవర్లలో ఒమర్‌జాయ్ రెచ్చిపోతూ ఒకే ఓవర్‌లో మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో 24 పరుగులు బాదాడు. లక్ష్య ఛేదనలో హాంకాంగ్ చైనా బ్యాటర్లు అఫ్గాన్ బౌలర్ల ధాటికి తట్టుకోలేకపోయారు. రెండో బంతికే తొలి వికెట్ కోల్పోయిన ఆ జట్టు వరుసగా రనౌట్స్, అద్భుతమైన క్యాచింగ్ కారణంగా కష్టాల్లో పడింది. చివరికి నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 94 పరుగులకే ఆలౌటైంది. అఫ్గాన్ బౌలర్లలో ఫజల్ హక్ ఫారూఖీ (2/16), గుల్బదిన్ నయీబ్ (2/8) విజృంభించగా, కెప్టెన్ రషీద్ ఖాన్ కూడా కీలక వికెట్ తీశాడు. ఫీల్డర్ల అద్భుత ప్రదర్శనతో హాంకాంగ్ చైనా ఏ దశలోనూ పోరాటం చేయలేకపోయింది. ఈ విజయంతో అఫ్గానిస్తాన్ టోర్నీకి దుమ్ము రేపుతూ, తన బలాన్ని చాటిచెప్పింది.


# జపాన్ బాక్సర్‌పై జయభేరి..

### సెమీఫైనల్లో నిఖత్ జరీన్




**బలగం టీవీ, హైదరాబాద్**

వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ నిఖత్ జరీన్ మరో అద్భుత విజయాన్ని సాధించింది. 51 కిలోల విభాగంలో జరిగిన క్వార్టర్ ఫైనల్లో జపాన్ బాక్సర్ యునా నిషినకాపై ఘన విజయం సాధించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ విజయంతో నిఖత్ మూడో వరల్డ్ చాంపియన్‌షిప్ పతకానికి మరింత చేరువైంది. ఇందూరు బిడ్డ నిఖత్, తొలి రౌండ్‌లో ప్రత్యర్థి ఆధిక్యంలోకి వెళ్ళినా, రెండో రౌండ్ నుంచే పంచ్‌ల వర్షం కురిపించింది. 4-1 తేడాతో ఆధిక్యం సాధించి, మూడో రౌండ్‌లోనూ అదే దూకుడుతో రాణించి, చివరకు స్పష్టమైన ఆధిక్యంతో గెలుపొందింది. రెండుసార్లు వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచిన నిఖత్ ఈసారి కూడా బంగారు పతకంపై కన్నేసింది. సెమీఫైనల్లో ఆమెకు టర్కీ స్టార్ బుసే నాజ్ కకిరోగ్లు సవాల్ కానుంది. ఒలింపిక్స్‌లో రెండు రజతాలు సాధించిన అనుభవజ్ఞురాలైన బుసేపై నిఖత్ పోరాటం ఆసక్తికరంగా మారనుంది.





# అల్లు అర్జున్‌కు జీహెచ్‌ఎంసీ షాక్

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్కు జీహెచ్‌ఎంసీ అధికారులు షాక్ ఇచ్చారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.45లోని అల్లు బిజినెస్ పార్క్ భవనంపై అనుమతి లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణంపై షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే రెండు సంవత్సరాల క్రితం అల్లు అర్జున్ కుటుంబసభ్యులు కలిసి జూబ్లీహిల్స్‌లో అల్లు బిజినెస్ పార్క్ భవనాన్ని నిర్మించారు. ఇందులో గీతా ఆర్ట్స్, అల్లు ఆర్ట్స్‌తో పాటు అనేక సంస్థల కార్యాలయాలు ఉన్నాయి. సుమారు 1226 గజాల స్థలంలో ఈ భవనానికి రెండు సెల్లార్లు, జీ ప్లస్ 4 అంతస్తులకే అనుమతి ఉన్నప్పటికీ ఇటీవల నాలుగో అంతస్తుపై అదనంగా అక్రమ నిర్మాణం చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 డీఎంసీ సమ్మయ్య విచారణకు ఆదేశించి, అక్రమ నిర్మాణాన్ని ఎందుకు కూల్చరాదో చెప్పాలంటూ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

# 'లిటిల్ హార్ట్స్'పై నాని ప్రశంసలు



**బలగం టీవీ, హైదరాబాద్**

మౌళి తనూజ్, శివానీ నాగరం హీరో-హీరోయిన్లుగా నటించిన సినిమా లిటిల్ హార్ట్స్ బాక్సాఫీస్ వద్ద విజృంభిస్తోంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంటూ హౌస్‌ఫుల్ షోలతో దూసుకుపోతోంది. మౌళి కామెడీ టైమింగ్, శివానీ నటన ప్రేక్షకులను బాగా అలరించగా.. ముఖ్యంగా కాలేజీ స్టూడెంట్స్ ఈ సినిమాకు బాగా కనెక్ట్ అవుతున్నారు. చిన్న సినిమాగా విడుదలై పెద్ద విజయాన్ని అందుకోవడం విశేషం. ఇక తాజాగా ఈ సినిమా చూసిన హీరో నాని సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపించారు. "సినిమా చూస్తున్నంతసేపు నవ్వుతూనే ఉన్నాను" అని పేర్కొంటూ మేకర్స్‌ను అభినందించారు. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్‌లో సాయి మార్తాండ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఆదిత్య హాసన్ నిర్మించగా, నిర్మాతలు బన్నీవాస్-వంశీ నందిపాటి థియేట్రికల్ రిలీజ్ చేశారు.





# మిరాయ్ సినిమా టికెట్లపై కీలక నిర్ణయం

**బలగం టీవీ, హైదరాబాద్**

ఈ నెల 12న విడుదల కానున్న సైన్స్ ఫిక్షన్ ఎంటర్టైనర్ 'మిరాయ్'పై హీరో తేజ సజ్జా కీలక నిర్ణయం ప్రకటించారు. వైజాగ్ బీచ్ రోడ్డులో జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో తేజ మాట్లాడుతూ "మిరాయ్ సినిమాను ఎంతో కష్టపడి, ప్రేమతో రూపొందించాం. ఎక్కువ మంది ప్రేక్షకులు ఈ చిత్రాన్ని థియేటర్స్‌లో ఆస్వాదించాలనే ఉద్దేశంతో, టికెట్ ధరలు పెంచకూడదని నిర్ణయించాం. నిర్మాత టీజీ విశ్వప్రసాద్, డిస్ట్రిబ్యూటర్లతో చర్చించి ఈ నిర్ణయానికి వచ్చాం. ఇది రిస్క్ అయినప్పటికీ, ప్రేక్షకుల నమ్మకాన్ని నిలబెట్టడమే మా లక్ష్యం" అని తెలిపారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో, తేజ సజ్జా హీరోగా, రితిక నాయక్ హీరోయిన్‌గా నటించారు. మనోజ్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఇదిలా ఉండగా, యూఎస్‌లో మిరాయ్ టికెట్ల అమ్మకాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. విదేశీ ప్రేక్షకుల నుండి కూడా మంచి స్పందన వస్తుందని టీం ఆశాభావం వ్యక్తం చేసింది.

# నేను క్షేమంగానే ఉన్నాను

- **కాజల్**



**బలగం టీవీ, హైదరాబాద్**

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వార్తలపై టాలీవుడ్ నటి కాజల్ అగర్వాల్ స్పందించారు. తాను క్షేమంగానే ఉన్నానని, అభిమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సోమవారం రాత్రి కాజల్‌కు రోడ్డు ప్రమాదం జరిగిందని, ఆమెకు గాయాలయ్యాయని వార్తలు వైరల్ కావడంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో కాజల్ తన ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల ద్వారా పోస్ట్ చేస్తూ.. ఆ వార్తలు పూర్తిగా అసత్యమని ఖండించారు. "దేవుని దయవల్ల నేను పూర్తిగా క్షేమంగా ఉన్నాను. ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మకండి, ప్రచారం చేయకండి" అని కాజల్ అభిమానులకు విజ్ఞప్తి చేశారు.

# జైల్లో పరిస్థితులు దారుణం.. బతకలేను

- **కోర్టులో దర్శన్ ఆవేదన**



**బలగం టీవీ, హైదరాబాద్**


అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కన్నడ నటుడు దర్శన్ కోర్టులో తన ఆవేదనను వ్యక్తం చేశారు. జైలు పరిస్థితులు భరించలేనివిగా ఉన్నాయని, తాను ఇక బతకలేనని, కనీసం విషమిచ్చి చంపేయాలని న్యాయమూర్తిని వేడుకున్నారు. మంగళవారం 64వ సిటీ సివిల్ అండ్ సెషన్స్ కోర్టు ఎదుట దర్శన్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన,

"చాలా రోజులుగా నేను సూర్యరశ్మి చూడలేదు. ఫంగస్ భయపెడుతోంది. వేసుకున్న బట్టలకు దుర్వాసన వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో నేను బ్రతకలేను.. దయచేసి నాకు విషం ఇవ్వండి" అని కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ, "అలాంటి అభ్యర్థన సాధ్యం కాదు" అని స్పష్టం చేశారు. గత ఏడాది జూన్‌లో అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో దర్శన్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. 2024లో హైకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ, సాక్షులను ప్రభావితం చేసే అవకాశాలున్నాయని సుప్రీంకోర్టు ఆగస్టు 14న బెయిల్‌ను రద్దు చేసింది. అప్పటి నుంచి దర్శన్ జైలులోనే ఉన్నారు. తాజా విచారణలో 13, 14వ నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్లను కోర్టు పరిశీలించి, అభియోగాల నమోదును సెప్టెంబర్ 19కి వాయిదా వేసింది. అలాగే తనను బళ్లారి జైలుకు తరలించవద్దని, కనీసం బెడ్, పరుపు వంటి సౌకర్యాలు కల్పించాలని దర్శన్ కోర్టును అభ్యర్థించారు.

# రేపు 'తెలుసు కదా' టీజర్

**బలగం టీవీ, హైదరాబాద్**

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'తెలుసు కదా' అక్టోబర్ 17న విడుదల కానుంది. ప్రముఖ స్టైలిస్ట్, ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వం వహిస్తుండగా, ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే తమన్ స్వరపరిచిన ఫస్ట్ సింగిల్ 'మల్లికా గంధ' చార్ట్‌బస్టర్‌గా నిలిచి, ప్రేక్షకులను ఆకట్టుకుంది. తాజాగా సెప్టెంబర్ 11న విడుదల కానున్న టీజర్‌కు ముందు ఒక పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో సిద్ధు జొన్నలగడ్డతో పాటు హీరోయిన్‌లు శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా కనిపించారు. పోస్టర్‌లోని ప్రెజెంటేషన్ ట్రయాంగిల్ లవ్ ట్రాక్‌ను సూచిస్తూ యూత్‌ఫుల్ ఎనర్జీతో ఆకట్టుకుంది.




# గల్వాన్ యుద్ధం ఆధారంగా సల్మాన్ ఖాన్ సినిమా

### 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'లో కల్నల్ సంతోష్ బాబు పాత్ర?

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న వార్ డ్రామా 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' షూటింగ్ ప్రారంభమైంది. ఈ చిత్రానికి అపూర్వ లాఖియా దర్శకత్వం వహిస్తుండగా, బాలీవుడ్ బ్యూటీ చిత్రాంగద సింగ్ కథానాయికగా నటిస్తోంది. సల్మాన్%-%చిత్రాంగద జంటగా కనిపించబోయే ఇది తొలి సినిమా. 2020లో భారత్-చైనా సరిహద్దు వద్ద జరిగిన గల్వాన్ లోయ ఘటన ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. షఉటింగ్ ప్రారంభించిన విషయాన్ని సల్మాన్ ఖాన్ స్వయంగా సోషల్ మీడియాలో ప్రకటించాడు. ఇక, ఈ సినిమాలో సల్మాన్ ఖాన్ తెలంగాణకు చెందిన వీర సైనికుడు, గల్వాన్ వీరుడు కల్నల్ సంతోష్ బాబు పాత్రలో నటించబోతున్నట్టు సమాచారం. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.